## సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు పరిష్కారం

### హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని

**కోహెడ, మార్చి 15, ప్రభాతవార్త :** సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు పరిష్కారం అవుతాయని హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి వి.శివరంజని అన్నారు. మండలంలోని వెంకటెశ్వర్లపల్లి గ్రామంలో మండల న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తమ తమ బాధ్యతలు, విధులు నిర్వహిస్తే నేర రహిత సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలను పాటించడం గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు బీమా,డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మహిళలను గౌరవించడం తల్లిదండ్రులు చిన్న తనం నుంచి అబ్బాయిలకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జేరిపోతుల కిరణ్‌కుమార్, కార్యదర్శి మహేందర్‌రెడ్డి, పారా లీగల్ వాలంటీర్ చిట్యాల సంపత్, పిడిశెట్టి కుమారస్వామి, గాలి భూమయ్య, మహిళా సంఘం అధ్యక్షులు మండ స్వరూప, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## గౌడ సంఘం అధ్యక్షుడిగా బాల్‌రాజు, కమిటీ సభ్యుల ఎన్నిక చెల్లదు

**కొమురవెల్లి, మార్చి 15,ప్రభాతవార్త :** కొమురవెల్లి గౌడ సంఘం అధ్యక్షునిగా బాల్‌రాజు, కమిటీ సభ్యుల ఎన్నిక చెల్లదని గౌడ సంఘం సభ్యులు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి ఖండించారు. మండల కేంద్రంలో కల్లు గీత వృత్తిదారులు టిఎఫ్‌టి లైసెన్స్ కలిగినవారు 66 సభ్యత్వాలు ఉండగా కేవలం కొంత మందితో ఎవరిని సంప్రదించకుండా అతని ఉనికిని చాటుకోవడం కోసం అధ్యక్షునిగా పత్రిక ప్రకటన ఇవ్వుకోవడం సరికాదన్నారు. సొసైటీ ఉన్న గ్రామంలో ఉన్నతాధికారులు వచ్చి కమిటీలను నిర్ణయించాలని కొమురవెల్లి గౌడ సంఘం సభ్యత్వాలు మాత్రం టిఎఫ్‌టికి సంబంధించినవని ఈ సందర్భంగా సభ్యులు గుర్తు చేశారు. ఈ ఎన్నిక చెల్లదని వారు ఖండించారు. సమావేశంలో మాజీ ఎంపిటిసి ముత్యం లక్ష్మయ్యగౌడ్, సీనియర్ నాయకులు ముత్యం నర్సింహులుగౌడ్, చేర్యాల పిఏసిఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింలుగౌడ్, దొమ్మాట సత్తయ్యగౌడ్, దొడ్డ బిక్షపతిగౌడ్, మారగోని బిక్షపతిగౌడ్. బత్తిని మల్లేశంగౌడ్, ముత్యం ఉప్పలయ్య గౌడ్, ముత్యం పెద్ద పర్వరాములుగౌడ్, బత్తిని కిష్టయ్యగౌడ్, యాదగిరిగౌడ్, నాగరాజుగౌడ్, విజయ్ కుమార్‌గౌడ్, రాజుగౌడ్, చిన్న నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు



గోడ నమూనా పత్రాలను అవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

## అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

తెలంగాణ గురుకుల మహిళా కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం అయన నమూనా దరఖాస్తు గోడపత్రాలను అవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాంఘీక గిరిజన మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల సంస్థ అధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రథమ సంవత్సరం(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశం కోసం అన్‌లైన్‌లో ఏప్రిల్ 12లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘీక సంక్షేమ ప్రాంతీయ సమన్వయకర్త కె.నిర్మల, కళాశాల ప్రిన్సిపల్ డా॥వి.సునీత, వైస్ ప్రిన్సిపల్ ఎం.డి.రిజ్వాన, అధ్యాపకులు వనజ, ఉమాదేవి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట మున్సిపాలిటీ అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తుంది

### జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

సిద్దిపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అన్ని మున్సిపాలిటీలకు అదర్శంగా నిలుస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. నీతి అయోగ్ భాగస్వామ్యంతో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్, చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అర్గనైజేషన్, రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్, కాకతీయ సాండ్ బాక్స్, బాల వికాస సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన 5 రోజుల ఇన్నోవేషన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేటలో పర్యటించారు. సిద్ధిపేట మున్సిపాలిటీలోని స్వచ్ఛబడిని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ సిద్దిపేటలోని స్వచ ్ఛబడిని అన్ని మున్సిపాలిటీలు అదర్శంగా తీసుకున్నాయని తెలిపారు. దేశ, రాష్ట్ర స్థాయిలో ఏ అవార్డులు ప్రకటించిన సిద్దిపేట పేరు లేకుండా అవార్డులు ఉండవని తెలిపారు. దేశ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులకు మున్సిపాలిటీ పలు మార్లు ఎంపికైందన్నారు. ఎమ్మెల్యే హరీష్‌రావు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్, పాలకవర్గం సభ్యులు చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను చైతన్యం చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు,మున్సిపల్ అడిషనల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అయా సంస్థల ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్‌పి




మాట్లాడుతున్న ఎస్‌పి చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి టౌన్, మార్చి 15, ప్రభాతవార్త:** తెలుగు సంవత్సరం ఉగాది, హోలీపండుగ, ముస్లింల రంజాన్, క్రైస్తవుల గుడ్‌ఫ్రైడేలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో పీస్ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయా మతాలకు చెందిన ప్రముఖులు హాజరు కాగా ఎస్‌పి వారికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. అన్ని మతాల పండగలు వరుసగా వస్తున్నాయని, అందుకు అందరు కలిసి మెలసి పండగలను జరుపుకోవాలన్నారు. సంఘ విద్రోహులు మత విద్వేషాలు, రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే, సమాజిక మాద్యమాల్లో పోస్టులు పెట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండగలు ప్రశాంతంగా ముగిసేలా పోలీసులకు ప్రజలు తమ వంతు సమాచారం అందించాలన్నారు. ఆపద సమయంలో ప్రజలు 100కు దయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ సంజీవ రావు, నారాయణఖేడ్ డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, వర్టికల్ డిఎస్‌పి జి రాణ వీరారెడ్డి, ఎస్‌బి ఎన్స్‌పెక్టర్ మల్లేష్, జిల్లా ఎన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు, ఆయా మతాల పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎస్‌సిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### -జిల్లా విద్యాధికారి రాధాకిషన్

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి15 ప్రభాతవార్త:**

ఎస్‌ఎస్‌సీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. శుక్రవారం మాచవరం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్తులు వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు పరచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా, భయపడకుండా పరీక్షలను ధైర్యంగా రాయాలని, ఎలాంటి భయాలకు లోనుకాకుండా పరీక్షలు రాయాలని తెలిపారు. అలాగే పాఠశాల తరపున పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్‌తో పాటు ప్యాడ్లు, పెన్నులు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలకంఠం, ఉపాధ్యాయులు పండరీ, సదన్‌కుమార్, జమీరుద్దీన్, నజీరుద్దీన్, అరుణ్ జ్యోతి, సుదర్శన్, అశోక్, ఫణీందర్, మధుమోహన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో అంతిమంగా న్యాయమే గెలుస్తుంది

- కక్షపూరిత రాజకీయాలకు చిరునామాగా కాంగ్రెస్ పార్టీ...
- అక్రమ కేసులను న్యాయస్థానంలో ఎదుర్కొంటాం
- గూడెం మధుసూదన్‌రెడ్డి అరెస్టును ఖండించిన మాజీ మంత్రి హరిష్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరిష్‌రావు

**పటాన్‌చెరు, మార్చి 15,ప్రభాతవార్త:** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గూడెం మధుసుధన్ రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరిష్‌రావు తీవ్రంగా ఖండిం చారు. పటాన్‌చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరిష్‌రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో వంద రోజుల పాలన ఎలా తయారైంది అంటే కాంగ్రెస్ పార్టీలో చేరాలి, లేదంటే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మంలో మూడు రోజులకు ఒకసారి నల్లా వస్తుందన్నారు. అక్రమ కేసులతో వేధి స్తున్నారని చెప్పారు. వందల మంది పోలీసులతో కలిసి తెల్లవారుజామున మూడు గంటలక వెళ్లి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అంత అవసరం ఏముందని తెలిపారు. నోటీసులు ఇవ్వరు, ఎఫ్‌ఐఆర్ కాపీ ఇవ్వరని అన్నారు. ప్రభు త్వాలు శాశ్వతంకాదని, గత పదేళ్లలో ఎప్పుడూ కక్షపూరితంగా వ్యవహరించ లేదన్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సి ఉన్నా కేవలం జైలుకు పంపాలని, కాంగ్రెస్ లో చేర్చుకోవాలని కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి విధానాలు మార్చుకోవాలని, మంత్రి ఆదేశాలతో టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు క్వారీలు మీద ఎటువంటి చర్యలు లేవు, వరుసగా కేసులు నమోదు చేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.వందరోజులు పూర్తి అయ్యాయి, హామీల అమలు పూర్తి కాలేదన్నారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. చివరకు ధర్మమే గెలుస్తుం దని, కోర్టుల ద్వారా అంతిమంగా న్యాయమే గెలుస్తుందని అన్నారు. మీ కుట్రలను ప్రజల ముందుకు తీసుకొని వెళ్తామని తెలిపారు. మెడమీద కత్తిపెట్టి జాయిన్ చేసుకుంటున్నారని అన్నారు. ప్రజా స్వామ్యంలో ఇది పనికి రాదని, ప్రజల మనసు గెలవండని, ప్రతిపక్షం లేకుండా చేయాలని అనుకోవడం సరికాదని ఘాటు సమాధానం ఇచ్చారు.

**ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధించాం...**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం మొత్తం ఎన్నో క్వారీలు ఉన్నా యన్నారు. తప్పుచేస్తే శిక్ష వేయండని, పటాన్‌చెరు నియోజకవర్గంలో గత పదేళ్లలో ఎవరి మీద కక్ష సాధింపు చర్యలు చేపట్ట లేదని గుర్తు చేశారు. ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, నేను తప్పు చేస్తే మూడు సార్లు గెలిచేవాళ్లం కాదన్నారు. పూర్తి పర్మిషన్స్‌తో క్వారీ నడిపిస్తున్నా మని, బెదిరింపులకు బయపడం అన్నారు. ప్రజా కోర్టులో తెల్చుకుందామని అన్నారు. కిందిస్థాయి నుండి ప్రజల మద్దతుతో రాజకీయాల్లో కొనసాగుతున్నామని అన్నారు.2012-13లో అప్పటి కాంగ్రెస్ పార్టీ హాయాంలో పూర్తి అనుమతితో క్వారీలను ప్రారంభించడం జరిగిందని, గత నాలుగు సంవత్స రాల నుండి మా కుటుంబ సభ్యులు స్వయంగా క్వారీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నిబంధ నలు ఉల్లంఘిస్తే చట్టపరంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొ న్నారు.

సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహిరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి హరిష్‌రావు పరామర్శించారు. అధైర్యం చెందాల్సిన అవసరం లేదని, బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

## అసైన్డ్ భూముల క్రయా విక్రయాలు చేస్తే క్రిమినల్ కేసులు : అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**కొల్చారం, మార్చి 15 ప్రభాతవార్త:** అసైన్డ్ భూముల క్రయా విక్ర యాలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కొల్చారంలోని తహాశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ చట్టవ్యతిరేకంగా అసైన్డ్ భూములను క్రయా విక్రయాలు జరిపితే వారి నుండి ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకుంటుందన్నారు. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ గఫార్ మియా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## అక్రమ కట్టడాల కూల్చివేత

**పటాన్‌చెరు, మార్చి 15,ప్రభాతవార్త:** జిన్నారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో కూల్చివేతలు జరిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పేదలమైన తాము 59 జీవో ద్వారా దరఖాస్తులు చేసుకున్నామని, అధికారులను అడ్డుకొని వివరించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి అధికారులు కూల్చివేతల విషయంలో వెనుకడుగు వేయకుండా సర్వే నెంబర్లు 283, 271, 273,284,620,627,729 భూముల్లో 23 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అధికార పార్టీ నాయకుల ఫిర్యాదుతోనే కూల్చివేతలు చేశారని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. పేద ప్రజలపై ఇలాంటి చర్యలు చేపట్టడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన కారణంగా తమపై అధికారుల ఆదేశానుసారం నిర్మాణాలపై చర్యలు చేపట్టినట్లు మండల తహసీల్ధార్ బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న మెట్టు గంగారాం

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన.... బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 15, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రాజ్‌ను జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మెట్టు గంగారాం మర్యాదపూర్వకంగా కలిసారు. శుక్రవారం నాడు ఆయన పలువురు బీసీ సంఘం నాయకులతో కలసి కలెక్టర్‌కు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని బీసీ సంక్షేమ సంఘం యొక్క వివరాలను గంగారాం కలెక్టర్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుండు మల్లేశం, నాయకులు సుంకోజు దామోదర్, పిట్ల శ్రీశైలం, వెలుములు రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటిహెచ్‌ను సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 15,ప్రభాతవార్త:** సంగారెడ్డి సమీపంలోని ఐఐటిహెచ్‌ను శుక్రవారం జపాన్ పారిశ్రామికవేత్తల 26 మందిప్రతినిధులు బృందం క్యాంపస్‌ను సందర్శించింది.వాతవరణాన్ని అంచాన వేయడానికి జాపనీస్ విధ్యార్థుల ప్రతిభను పెంపోందించే దిశగా జపాన్ పారిశ్రామికవేత్తల అన్వేషణలో భాగంగా వివిద ఎస్‌ఎంఇల సిఈఓలు అధ్యక్షులతో కూడిన బృందం సందర్శించింది.పరస్పర ప్రయోజనాలు మరియు భవిష్యత్ సహాకార అవకాశాలకు సంబందించిన పలు అంశాలపై ఇరుపక్షాలు చర్చించారు.



ఐఐటిహెచ్ క్యాంపస్‌ను సందర్శించిన జపాన్ బృందం

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

**పాపన్నపేట, మార్చి 15, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో క్రిమి సంహారక మందును తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండల పరిధిలోని మల్లపేటలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పర్వనోల్ల దుర్గయ్య (30) సపాయి పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడన్నారు. తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరగుతూ ఉండేవని, శుక్రవారం సైతం ఇరువరి మధ్య గొడవ జరగడంతో ఇంటిబయటకు వెళ్లిన దుర్గయ్య క్రిమి సంహారక మందును సేవించి ఇంటికి వచ్చి పడుకోవడంతో దుర్వాసనను గమనించిన కుటుంబీకులు విషయంగ్రహించి మెదక్ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించామన్నారు. పరిస్థితి విషమం గా ఉండటంతో హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్యమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్త చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు కుటుంబీకులు పేర్కొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష

**ములుగు, మార్చి 15 (ప్రభాతవార్త):** పది రోజుల క్రితం పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతుండగా బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు రిపోర్టు రావడంతో అతన్ని శుక్రవారం గజ్వేల్ ప్రిన్సిపల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.ప్రియాంక ముందు హాజరుపర్చగా విచారణ జరిపి ఆ వ్యక్తికి రెండు రోజుల జైలు విధించినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, కోరి ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**చేర్యాల, మార్చి 15, ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం చేర్యాల మండలం తాడూరు గ్రామ వాగు నుండి ఒక ట్రాక్టర్, చేర్యాల పట్టణ శివారులో రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తు న్నారని నమ్మదగిన సమాచారం అందడంతో ఎస్సై దామోదర్‌తో పాటు ఏఎస్‌ఐ నవీన్, కానిస్టేబుళ్ళు సంపత్, హనుమంత్‌లు వెళ్ళి మూడు ట్రాక్టర్లను పట్టకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎస్సై దామోదర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, పీడిఎస్ బియ్యం, పేకాట, గంజాయి ఇతర ఏదేని చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

### -130 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు ఫోన్‌లు స్వాధీనం

**వర్గల్, మార్చి 15 (ప్రభాతవార్త):**

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందని గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ శివకుమార్‌లు తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్గల్ మండలకేంద్రానికి చెందిన దిండి శివానంద్‌గౌడ్(20), చెన్నకిష్టి సాయికిరణ్(20)లు ఈనెల 14వ తేదీ గురువారం మండలంలోని అవుసులోనిపల్లి పల్లె ప్రకృతి వనంలో గంజాయి అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో దాడిచేసి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న టిఎస్05 ఎఫ్‌బి2070 నెంబర్ గల గ్లామర్ మోటార్‌బైక్ టూల్ బాక్స్‌లో తనిఖీ చేయగా అందులో ఒక ప్లాస్టిక్ కవర్‌లో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 130 గ్రాముల గంజాయి, మోటార్‌బైక్, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని ఎవరైనా పిల్లలు గంజాయికి అలవాటు పడినట్లు తెలిస్తే వారి తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేసినట్లయితే కౌన్సిలింగ్ నిర్వహించి వారు అలవాటు మానుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గంజాయి ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే 8702667336, 8712667340 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.



వివరాలు తెలుపుతున్న గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి

# మంత్రి దామోదర్‌ను విమర్శించడం విడ్డూరం

- ఎమ్మెల్యే సోదరుల అరాచకం
- ప్రభుత్వానికి 30 కోట్ల రాయల్టీ ఎగవేత
- మాజీ మంత్రి హరిష్‌రావు భాగోతం తెలియంది ఎవరికి
- కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడతున్న కాట శ్రీనివాస్‌గౌడ్

**పటాన్‌చెరు, మార్చి 15,ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసుధన్‌రెడ్డి అరెస్టు విషయంలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రమేయం ఉందని, మాజీ మంత్రి హరీష్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...మండలంలోని లక్డారం క్వారీ విషయంలో గూడెం మహిపాల్‌రెడ్డి ప్రభుత్వానికి 30 కోట్ల రాయల్టీని ఎగ్గొట్టారని, పరిమితికి మించి 10 లక్షల క్యూబిక్ మీటర్ల మేరకు అక్రమంగా మైనింగ్ చేశారని, 300 కోట్ల రుపాయలు ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బు ఎగ్గొట్టారని విమర్శించారు. నాటి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారన్నారు. ఎమ్మెల్యే, ఆయన సోదరుల అరాచకాలు అంతా ఇంతా కాదన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు గతంలో దొంగలకు సద్ది కట్టారని విమర్శించారు. చెరువులు, కుంటలు కబ్జా చేసి వందల కోట్లరుపాయలు కొల్లకొట్టారని విమర్శించారు. గ్రీన్ ట్రిబ్యూనల్ తీర్పు ఇచ్చినా 10.03. 2023 నాడే క్లోజింగ్ ఆర్డర్ వచ్చినా అధికారులు దాచిపెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. వేల కోట్ల రుపాయలు అవినీతిచేసి దోచుకున్న డబ్బు దాచుకున్నారని మండిపడ్డారు. పుట్టకతో భూస్వామి అంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి 2014లో తన అఫిడవిట్‌లో ఆస్తుల చిట్టా తీస్తే తెలుస్తుందన్నారు. పటాన్‌చెరును ఏటిఎంలుగా మార్చుకోని అక్రమాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అవసరం లేదన్నారు. అక్రమ దందాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇదే మాజీ మంత్రి హరీష్‌రావు నన్ను గతంలో బిఆర్‌ఎస్ పార్టీలోకి రావాలని ఒత్తిడి చేసి, ఒప్పుకోకపోతే తనను సర్పంచి పదవి నుండి తొలగించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ నిస్వార్థంగా ప్రభుత్వం నడిపిస్తుందని అవినీతి ప్రోత్సహించేది లేదన్నారు. హరీష్‌రావు బాగోతాలు అందరికి తెలుసన్నారు. ఏ భూమి కబ్జా అయినా, ఎక్కడ అవినీతి జరిగినా వారి హస్తం ఉంటుందని ఆరోపించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో జరిగిన భారీ కుంభకోణాలలో హరిష్‌రావు వాట ఎంతో చెప్పాలని డిమాండ్‌చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహాపై హరిష్‌రావు అసంబద్ధ ప్రేలాపనలు తగదన్నారు. 40వేల దొంగ ఓట్లతో గెలిచిన మహిపాల్‌రెడ్డిది ఓ గెలుపా అని అన్నారు. నిజంగా నిజాయితి ఉంటే తక్షణమే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడే మహిపాల్‌రెడ్డి రాజీనామ చేస్తు ఇద్దరం ఎన్నికలకు పోదామని, 30వేల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, కౌన్సిలర్ మున్నా, కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీశైలం, శివానంద్, వెంకన్న, రాజిరెడ్డి, జయమ్మ, చిన్న ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దచింతకుంటలో సిసి రోడ్ల నిర్మాణాలు ప్రారంభం

**నర్సాపూర్, మార్చి 15, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి నిధులతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులను శంఖుస్థాపనలు చేశారు. పెద్దచింతకుంట గ్రామంలోని పలు కాలనీల్లో సిసి రోడ్ల నిర్మాణాలను ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకట నర్సింగరావు, గ్రామ మాజీ సర్పంచ్ గుండెశివకుమార్ ల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి సిసి రోడ్ల నిర్మాణ పనులను వారు ప్రారంభ్పుంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాబివృద్ధి కోసం ఎమ్మెల్యే నిధులతో సిసి రోడ్ల నిర్మాణాలు చేయడం జరుగుతందన్నారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినందులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి కి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు, గ్రామ తాజా మాజీ సర్పంచ్ గుండెశివకుమార్ ల తో పాటు తాజా మాజీ ఉప సర్పంచ్ కడారి నాగరాజు, రాములు, ప్రసాద్, మల్లేషం, బిక్షపతిగౌడ్, మురళీ, గౌరయ్య, నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**నర్సాపూర్, మార్చి 15, ప్రభాతవార్త:** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నర్సాపూర్ నియోజకవర్గం వెల్దూర్తి మండలం మంగళపర్తి గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మంగళపర్తి గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణారావు, మాజీ సర్పంచ్ మిర్జాపల్లి కరుణాకర్ తో పాటు 100 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినారికి కాంగ్రెస్ పార్టీ కండూవాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, మల్లేషం, ఉదయ్‌కుమార్, హరీష్‌కుమార్, సుదర్శన్‌గౌడ్, నరెందర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి

**విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి**

**నర్సాపూర్, మార్చి 15, ప్రభాతవార్త:** విశ్వబ్రాహ్మణ కులస్తుల అభివృద్ధి కోసం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూవిశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల కులస్తులు కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, అవుసుల కులస్తులు కేవలం తమ కులవృత్తులపైనే ఆదారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల ఐదు జాతుల వారు కులవృత్తులను నమ్ముకొని బతుకు జీవనం సాగిస్తున్నందున ప్రస్తుతం యంత్రాలు రావడంవల్ల ఈ వృత్తుల వారికి పనులు దొరకక పోగా కడు దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అన్నికులాల వారికి 16 కార్పోరేషన్ లు ఏర్పాటు చేయగా ఒక్క విశ్వబ్రాహ్మణ కులస్తులకు కార్పోరేషన్ ఏర్పాటు చేయక పోవడం బాధకరమని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల అభివృద్ధి కోసం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కమ్మరి కృపాచారి కోరారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రులను గౌరవిస్తే వృద్ధాశ్రమాల అవసరమే లేదు

**కొండపాక, మార్చి 15, ప్రభాతవార్త :** తల్లి ఆశీర్వాదంలో ఏ కార్యక్రమం చేపట్టిన విజయవంతగా పూర్తి అవుతుందని కొండపాక బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం విఠల్‌నాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో మాతృ వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఏ పనిచేసినా మొదట కన్నతల్లి ఆశీర్వాదం తీసుకొని మొదలు పెడితే అది తప్పకుండా సక్సెస్ అవుతుందన్నారు. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయలపట్ల సరైన అవగహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు, సమాజం పట్ల గౌరవం భావం కలిగి ఉండాలని సూచించారు. నైతికి విలువలు కొరవడిన నేటి సమాజంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిసై తల్లిదండ్రులను చిన్నప్పటి నుండే పిల్లలు గౌరవించడం నేర్చుకుంటారని తెలిపారు. భారతదేశ సాంప్రదాయంలో తల్లి స్థానం మొదటిదని అ తర్వాత తండ్రి, గురువు స్థానమన్నారు. తల్లిదండ్రులను గౌరవిసై వృద్ధాశ్రమాల అవసరం మనకు ఉండదన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల శ్రమకుతగ్గ పలితాలను తీసుకొస్తారని అయన అశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ హస్టల్ వార్డెన్ పర్శరాములు, ఉపాధ్యాయులు సత్యలక్ష్మి, రఘువర్ధన్‌రెడ్డి, రామస్వామి, మహేందర్, రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాలమల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో మౌలిక వసతుల బాధ్యత విఒ అధ్యక్షులదే

**కొండపాక, మార్చి 15, ప్రభాతవార్త :** గ్రామాల్లోని పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయలు గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు పాఠశాల చైర్‌పర్సన్ హోదలో ఇకనుండి చూడవలసి ఉంటుందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఎంఈఒ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక ఐకెసిలో అమ్మ అదర్శ పాఠశాల కమిటీ సమావేశం వివో అధ్యక్షులు, వివోఎలకు ఎంపిడిఒ వెంకటేశ్వర్లు అద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక నుండి గ్రామాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతులను గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు పాఠశాలకు చైర్‌పర్సన్‌గా ఉంటారని, పాఠశాల హెచ్ఎం కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. పాఠశాలలో తాగునీరు, నీటి కుళాయిలు, టాయిలెట్స్, బాత్రుమ్‌లు, లైట్స్, ఫ్యాన్స్, టాప్స్, వివిధ రకాలైన స్కూల్ పనులను పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాస్, విఒ అధ్యక్షురాలు, గ్రామ సంఘం సహయకులు, సీసీలు, యాకోబు, లింగం, అశోక్, బాలకిషన్, కవిత, సుల్తానా, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కళ్యాణ మండపం నిర్మాణంతో పేదలకు ఎంతో ఉపయోగం

**నర్సాపూర్, మార్చి 15, ప్రభాతవార్త:** మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో వెలిసిన శ్రీగండభేరుండ లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయ ప్రాంగణంలో కళ్యాణ మండప నిర్మాణదాత చెంది శోభరాణి శ్రీనివాస్‌గౌడ్ ల ఆధ్వర్యంలో తండ్రి స్వర్గీయ చెంది నర్సాగౌడ్ జ్ఞాపకార్ధం నిర్మించిన కళ్యాణ మండపం పేదల పెళ్ళిల్లు చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది. గురువారం లింగాపూర్ గ్రామానికి చెందిన చింతల కిషన్ కూతురు వివాహం మొట్టమొదటగా ఈ కళ్యాణ మండపంలో ఎంతో వైభవంగా జరిగింది. ఈ వివాహానికి కళ్యాణ మండపం నిర్మాణ దాత చెందిశోభరాణి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు హాజరయ్యి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా ప్రస్తుతం పేదింటి వారు కూతురుల పెళ్ళిల్లు చేసుకోవడానికి ఏ పంక్షన్ హాల్ ను బుక్ చేసుకున్న లక్షల్లో ఉంటుందని ఈ మేరకు లింగాపూర్‌లోని శ్రీగంధభేరుండ లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన కళ్యాణమండపంలో ఉచితంగా వివాహాలు జరుపుకోవచ్చును. ఈ సందర్బంగా కళ్యాణ మండపం నిర్మాణదాత చెంది శోభరాణి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఏతండ్రికైనా కూతురు వివాహం చేయడం తలకుమించిన బారమవుతుందన్నారు. ఈ మేరకు పేదల కూతుళ్ల వివాహానికి తాను స్వయంగా కోటి రూపాయిలు వ్యయం చేసి నిర్మించిన ఈ కళ్యాణ మండపం పరోక్షంగా పెదింటి వారి పెళ్ళిళ్ళకు ఉపయోగ పడుతుందంటే తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇంకా మునుయందు ఈ కళ్యాణ మండపంలో ఎవరైనా సరే శుభాకార్యాలు, వివాహాది కార్యక్రమాలు చేసుకుంటే తనకు ఎంతో ఆనందంగా ఉంటుందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ సందర్బంగా వివాహాది కార్యక్రమాలు జరుపడానికి లక్షల్లో ఖర్చు అవుతున్న తరుణంలో నిస్వార్ధంగా ఈ కళ్యాణ మండపం నిర్మించి పేదలకు పరోక్షంగా వివాహాలకు తోడ్పడుతున్న కళ్యాణ మండప నిర్మాణ దాత చెంది శోభరాణి శ్రీనివాస్‌గౌడ్ ల ను గ్రామస్తులు బందువులు అబినందిచారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మండప నిర్మాణదాత చెంది శ్రీనవాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఉప్పలపు అశోక్, నాయకులు లక్ష్మీనర్సయ్య, చింతల విఠల్, బోయిని నర్సింలు, నాగమల్లేష్, కంజర్ల ఆంజనేయులు, ఇస్తారి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల ట్యాక్సులన్నీ చెల్లించిన చిన్నగోల్కొండ

# మాజీ సర్పంచ్ పద్మావతిఅనంతరెడ్డి



**శంషాబాద్, మార్చి 15, ప్రభాతవార్త** 2023-24 ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో చిన్నగోల్కొండ గ్రామ తాజామాజీ సర్పంచ్ గుర్రం పద్మావతి అనం తరెడ్డి గ్రామంలోని 100శాతం ఇంటిపన్నులు చెల్లించి జిల్లాలో ఆదర్శంగా నిలిచారు. గత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరి ఇంటి ట్యాక్సులను తానే చెల్లిస్తానని ఇచ్చిన వాగ్దానం మేరకు ఐదు సంవత్సరాల పాటు సర్పంచ్ పన్నులు చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం సర్పంచ్ పదవి కాలం తీరిపోయినప్పటికీ ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ ఆర్థిక సంవత్సరం కూడా 100 శాతం ట్యాక్సులను పద్మావతి అనంతరెడ్డి చెల్లించారు.

శంషాబాద్ మండల పంచాయతీ అధికారి ఉషాకిరణ్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి నాగేష్, కారోబార్‌బాబు సమక్షంలో 100శాతం ట్యాక్సులు చెల్లించి జిల్లాలో అందరికీ ఆద ర్శంగా నిలిచారు. గ్రామంలో 100శాతం ట్యాక్సులు చెల్లించడం పట్ల పంచా యతీ అధికారి పద్మావతి అనంతరెడ్డిని అభినందించారు. గ్రామ అభివృద్ధికి గ్రామస్తులపై ఆయనకున్న ప్రేమ అభిమానానికి ఇదే నిదర్శనం అని పేర్కొన్నారు.



హనుమాన్ గుడి అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దృశ్యం

## ఆంజనేయస్వామి గుడి అభివృద్ధికి విరాళం

**తలకొండపల్లి, మార్చి 15, ప్రభాతవార్త** మెదక్‌పల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం గుడిగోపురం కోసం 5000 వేల రూపాయలు అందించారు. అందజేసిన వారిలో గడ్డమీదితండా సర్పంచ్ ఈశ్వర్ నాయక్, అంతేకాకుండా బల్సులపల్లి సర్పంచ్ దశరథ్ నాయక్ 20 సిమెంట్ సంచులు అందజేశారు.

అదేవిధంగా బానావత్ చందు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ భీమ్‌లాల్ తన వంతు సాయంగా హనుమాన్‌గుడి అభివృద్ధికి పదివేల రూపాయలు గడ్డమీదితండా మాజీ ఉపసర్పంచ్ శ్యేనాయక్‌కు అందజేశారు.

### ఎమ్మెల్యే శంకర్‌కు జడ్పిటిసి శుభాకాంక్షలు

**కేశంపేట, మార్చి 15, ప్రభాతవార్త** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కేశంపేట జడ్పిటిసి విశాలశ్రవణ్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో శంకర్‌ను ప్రత్యేకంగా కలిసి శాలువాతో సన్మానించి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటిసితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**బొంరాస్‌పేట్, ఫిబ్రవరి15, ప్రభాతవార్త :** దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామం శ్రీ గాయత్రి పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవంను కరస్పాడెంట్ రమేష్‌గౌడ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం విద్యార్థులు ఉపాధ్యాయులుగా ప్రత్యేకంగా తయారై పాఠశాలకు వచ్చారు. అనంతరంతమ తోటి విద్యార్థులకు పాఠ్యంశాలను బోధించి ఉపాధ్యాయులు తమకు పాఠ్యంశాలు చేప్పేందుకు ఎంత కష్టపడుతున్న విషయంను తెలుసుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతోపాటు మంచి ఉద్యోగాలు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. స్వయం పరిపాలన దినోత్సవంలో జిల్లా విద్యాధికారిగా సిద్దార్థ్, మండల విద్యాధికారిగా మాధురి, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మణికుమార్‌తోపాటు 27 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

**దారూర్, మార్చి 15, ప్రభాతవార్త** వేసవి కాలంలో దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం దోహదపడుతుందని వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్‌లోని ఆలంపల్లి రోడ్డులో ప్రజలకు చల్లని నీరు అందించి వారి దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో సందీప్ మెడికల్ వారి ఆద్వర్యంలో శివాని చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ నిర్వాహకులు సందీప్ ప్రవీణ్ విజయ్ నరేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

**రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో స్వపరిపాలన వేడుకలు**

**10వ తరగతి విద్యార్థులకు వీడ్కోల్ సమావేశం**



రాయికల్ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఒక్కరోజు ఉపాధ్యాయులు

**షాద్‌నగర్, మార్చి 15, (ప్రభాతవార్త) :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో రాయికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యబోధనలు చేసి వారి తల్లిదండ్రులను, చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలిగా వైష్ణవి, డీఈఓగా అమూల్య, ఆర్జేడీగా విశాల్‌లు చక్కగా వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, ఉపాధ్యాయ బృందం చిన్నారులను అభినందించారు.

### 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు

అదేవిధంగా మరో రెండు రోజుల్లో 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు వెళు తున్నందున్న వారికి 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ మాట్లాడుతూ... ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మరో రెండు రోజుల్లో పరీక్షలు ప్రారంభమ వుతు న్నాయని పరీక్ష హాలుకు గంట ముందు చేరుకోవాలని, పరీక్ష హాల్లో సమయ స్పూర్తితో ఉన్న సమయయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని భయపడకుండా ధైర్యంగా పరీక్ష రాయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీకె అరుణమ్మకి బీజేపీ నేతల శుభాకాంక్షలు



డీకె అరుణమ్మకు కృతజ్ఞతలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

**కొత్తూర్, మార్చి 15, ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల్లో సందర్భంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా డీకె అరుణమ్మకు ప్రకటించినందుకు బీజేపీ పార్టీ అధిష్టానానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ అమ్దా పూర్ నరసింహగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారతీయ జనతా పార్టీ ఈ యొక్క పార్లమెంట్ టికెట్ అరుణమ్మకి ప్రకటించడం హర్షనీయం వ్యక్తం చేస్తూ అదే విధంగా ఈయొక్క పార్లమెంట్ స్థానాన్ని కొత్తూర మండలం బీజేపీ పార్టీ నాయకులు అందరం నిరంతరం శక్తివంచనతో కృషి చేసి కార్యకర్తలం దరూ అఖండ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపి ఈ యొక్క మహ బూబ్‌నగర్ పార్లమెంట్‌ని నరేంద్రమోడీకి బహుమతిగా అందజేస్తామన్నారు.



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

## గురుకుల ఇంటర్ విద్యార్థినులకు వేసవి శిక్షణ శిబిరం

**మొయినాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** తోల్కట్ట సమీపంలోని చేవెళ్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్పార్కిల్స్ అనే వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి హెచ్‌ఆర్‌ఆర్ పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డా. శారద వెంకటేష్, బంట్వారం పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి విచ్చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి ముందుగా జ్యోతి ప్రజ్వలనతో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ నెల 15 నుంచి 29 వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో లైఫ్ స్కిల్స్, మొబైల్ యాప్స్, ఇంటర్ ప్రినియార్టిప్, యంగ్ జర్నలిస్టు అనే నాలుగు రకాల అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. మొత్తం 13 గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఎనిమిది మంది శిక్షణ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సమన్వయ అధికారి డా. శారద వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థినులు అంతా ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మంచి జీవన నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు గురుకుల సంస్థ కార్యదర్శి సీత లక్ష్మికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నకిలీ వరిధాన్య విత్తనంతో కూలిపోయిన వరి చేను

## నకిలీ విత్తనాలతో ధాన్యం పంట నష్టం

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు**

**యాచారం మార్చి15, ప్రభాతవార్త :** అరగలం కష్టపడి పండించిన రైతుల కు అన్ని కోణాల్లో నష్టమే కొనసాగుతుంది. యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలలో రైతులు వరి సాగుపై ఎక్కువ మక్కువ చూపుతూ సాగు చేశారు. వివిధ రకాల నాణ్యమై వంగడాలను కోరుతూ వరి విత్తనాలను వివిధ రకాల ఫెర్టిలైజర్ షాపు నుండి కొనుగోలు చేసి ఎంతో కష్టపడి వరి విత్తనాలను నారు కోసం సాగు చేయగా మొలకేతే దశలోనే సరిగా రాక నష్టం జరిగింది. నాశిరకం విత్తనం మొలకెత్తకపోవడం చలి తీవ్రత తెగులకు తట్టుకోలేక వేసిన దాంట్లో సగభాగమే మొలకెతినత నారొచ్చింది. కొద్దిగా వచ్చిన వరి నారును ఎంతో శ్రమించి రైతులు నాటును పెట్టగా పూర్తిగా తెగుళ్లకు గురై వరి పంట పూర్తిగా నశిస్తున్న తరుణంలో మళ్లీ రైతులు ఫెర్టిలైజర్ షాప్ చుట్టు తిరిగి మందులు తీసుకొచ్చి పిచికారి చేయ గా అందులో సగభాగమే రైతులకు పంట పండే అవకాశం ఏర్పడింది. గతంలో రైతాంగం రైతులు ఒకసారి సామాన్యమైన తన పండించిన వారి దాన్యాన్ని విత్తనాలుగా ఉపయోగించి మెరుగైన పంటలు పండించేవారు నేడు పూర్తిగా ఫెర్టిలైజర్స్ షాపు పైనే ఆధారపడి నాణ్యమైన విత్తనాలకు కొనుగోలు చేసేందుకు కృషి చేయగా ఫెర్టిలైజర్ షాప్ విత్తనాలు అధిక ధరలకు విక్రయించగా నారులో మెలకువ లేకపోవడం సాధారణ తెగులు గురై పూర్తిగా నిశించిపోతున్నాయి. వరి చేను ఫర్టిలైజర్ షాపు వాడు క్రిమి సంహారక మందుల వాడితో కుమ్మక్కై మందులు కొడితేనే పంటలు పండే విధంగా విత్తనాలు పంపించేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వ్యవ సాయ శాఖ అధికారులు నాణ్యమైన విత్తనాల సరఫరా చేయించడంలో పూర్తి విఫలమయ్యారని పలువురు భావిస్తున్నారు. ఫెర్టిలైజర్ షాప్ వాళ్లను తనిఖీ చేయకపోగా చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వేల రూపాయలు వెచించి నారు పోయేగా పంట రాకపో వడంతో తీవ్ర నష్టపోయిన రైతులను ఆదుకునేదేరని వారిపై చర్యలు తీసుకొనేదేలాని నష్టపోయిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలకు ఎంత ఖరీదైన సరే చెల్లించేందుకు రైతులు ముందున్న ఫెర్టిలైజర్ షాప్ వారు క్రిమిసంక మందుల వాడితో కుమ్మక్క య్యే ఇలాంటి విత్తనాలు పంపిణీ చేస్తున్నారని ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. నకిలీ వరి దాన్యం విత్తనాల వల నష్టపోయిన రైతులను గుర్తించి సంబంధించిన విత్తనాల పంపిణీ వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ రైతు సంఘాల వారు డిమాండ్ చేస్తున్నారు.

### విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**ధారూర్ మార్చి15, ప్రభాతవార్త :** విద్యుత్ షాక్‌కుగురై రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మదులపల్లి ప్రేమ్‌కుమార్(35) వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తు న్నాడు. ఎప్పటిలాగే వాగులోంచి తన వరి పైరుకు నీరు పెట్టడానికి వెళ్లాడు. మోటారు ఆన్ కాకపోవడంతో ఆటోమెటిక్ వేసి మోటర్ సరిచేస్తుండగా ఒక్కసారిగా అర్తువచ్చి విద్యుత్ ఘాతానికి గురై అక్కడే నీళ్లలో పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చా రు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మండల బిఎస్పీ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్సీరాం జయంతి దృశ్యం

## బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలి

**మొయినాబాద్ బిఎస్పీ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్**

**మొయినాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా అందరం పని చేయాలని మొయినాబాద్ మండల బిఎస్పీ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ పిలుపునిచ్చారు. అందుకు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్సీరాం చూపిన మార్గంలో పయనించాలని అన్నారు. మొయినాబాద్ మండల చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో కాన్సీరాం 90వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్బంగా కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తర్ ప్రదేశ్‌కు ఒక బహుజన మహిళను ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాన్సీరాంకే దక్కుతుందని అన్నారు. కాన్సీరాం ఆశయ సాధనకు బహుజనులు అంతా ఏకం కావాలని, రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాన్సీరాం స్పూర్తితోనే తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బిఎస్పీని నడిపిస్తున్నారని అన్నారు. మండల ఉపాధ్యక్షుడు ఎల్గని శ్రీకాంత్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి షాబాద్ నాగరాజు, ఆర్య, శాంతికుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 15, ప్రభాత వార్త:** పేద ప్రజల సంక్షేమం కొరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం యంనంపేట్, అన్నోజిగూడ, ఇస్మాయిల్ ఖాన్‌గూడ, రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన దాదాపు 17 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ పి. వేమన రెడ్డి, కౌన్సిలర్లు జి. మహేశ్ కురుమ, సింగిరెడ్డి సాయిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, మున్సిపల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, నాయకులు నర్రీ కాశయ్య, సామల బుచ్చిరెడ్డి, బి. జగన్‌మోహన్ రెడ్డి, మోటుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న లక్ష్మణ్

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 15, ప్రభాత వార్త:** మాతా శిశు సంరక్షణ కోసం న్యూట్రీషన్ కిట్లను బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పంపిణీ చేశారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడలోని బస్తీ దావఖాన ఆయుష్మాన్ భారత్ సెంటర్‌లో గర్భిణీలు, బాలింతలకు శుక్రవారం ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరీరక్షణకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలు రక్తహీనతతోపాటు పోషకాహారలోపంతో బాధపడకూడదని ప్రభుత్వం బస్తీ దవాఖానల్లో న్యూట్రిషన్ కిట్లను అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డితో పాటు పోచారం మున్సిపల్ కమిషనర్ పి. వేమన రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేశ్ కురుమ, మెట్టు బాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు నానావత్ బిక్కునాథ్ నాయక్, తౌర్య నాయక్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్ నాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు చలువాది ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు, ఇజిఎస్ పనులపై అవగాహన



ఓటరు నమోదు, ఇజిఎస్ పనుల నిర్వహనపై అవగాహన కార్యక్రమంలో ఉద్యోగులతో సమావేశమైన అధికారులు

**కందుకూరు, మార్చి 15, ప్రభాతవార్త:** 18 సంవత్సరాల నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని జాబ్‌కార్డు కలిగ్గిఉన్న వారందరికి యంజిఎన్‌అర్‌ఇజిఎస్ ద్వారా పనులు కల్పించాలని కందుకూరు తహసీల్దార్ గోపాల్, యంపిడిఓ సరిత లు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ ప్రాంఘనంలో పంచాయతీ కార్యదర్శులు, యంజిఎన్‌అర్‌ఇజిఎస్ సిబ్బంది, ఐకెపి సిబ్బంది తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతు వేసవికాలం ప్రారంబమైందని ప్రజలకు ఉపాది అవకాశాలు లేకుండా పోతన్నందున ప్రభుత్వం అమలు చేస్తున్న యంజిఎన్‌అర్‌ఇజిఎస్ పనులు ముందే నిర్దేశించుకున్న ప్రణాళికల ప్రకారం అమలు చేస్తు కూలీలకు పని వసతి చూపించాలన్నారు. కూలీలు పనిచేసే ప్రాంతంలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని అదేవిదంగా సేదతీరడానికి నీడసదుపాయం కల్పించాలన్నారు. గ్రామాలలో నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో ఇంటి పన్నులను 100 శాతం వసూలు చేయాలని అదేశించారు. ప్రభుత్వాలు శాఖల వారిగా నిర్దేశించిన పనులను సమర్థవంతంగా అమలు చేస్తు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రవీందర్‌రెడ్డి, సిబ్బంది, తోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

## కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

**వర్గల్, మార్చి 15 (ప్రభాతవార్త):** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వర్గల్ మండలకేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటయ్యగుప్త, మాజీ అధ్యక్షుడు విశ్వనాథంగుప్తల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. అగ్రవర్ణ పేదల్లో సైతం తినడానికి తిండిలేని వారు ఉండగా, ఫీజులు కట్టలేక వారి పిల్లలు కూలీ పనులు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటుతో పాటు వివిధ కులాలకు చెందిన 16 కార్పోరేషన్లను ఏర్పాటుచేసి ఆర్థికంగా ప్రోత్సహించడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడివుండగా ఇప్పటికే ఆరు గ్యారంటీలలో 5 పథకాలు అమలుచేసినట్లు తెలిపారు. పేదలకు రూ.10 లక్షల వ్యయంతో కార్పోరేట్ వైద్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, రూ.5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేత తదితర పథకాలు అమలు చేస్తుండడంతో పేదల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాలలో హర్షం వ్యక్తమవుతున్నా ప్రతిపక్ష బిఆర్ఎస్ మాత్రం పేదల అభ్యున్నతిని జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ప్రభుదాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు తోట ముత్యాలు, చేపూరి చంద్రమోహన్‌గుప్త, అమర బాలేష్‌గుప్త, కస్ప రాజేశ్వర్‌గుప్త, రమేష్‌గుప్త, లచ్చులుగుప్త, విశ్వప్రసాద్, పెంటయ్య, బద్రీనాథ్, శ్రీనివాస్, గౌరీశంకర్, నూక సతీష్, పెద్ది శివ, శ్రీకాంత్, రాంబాబుగుప్త తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేతలు

## మున్సిపాలిటీ నిధులు అన్ని వార్డులకు అందేలా చూడాలి

**చేర్యాల, మార్చి 15, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఇటీవల చేర్యాల మున్సిపాలిటీకి విడుదల చేసిన నిధులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన పేరుతో ఉన్న కాలనీకి మాత్రమే నిధులను వినియోగించుకుంటున్నాడని అది సరైంది కాదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో, రాళ్లబండి నాగరాజు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులకు ఈ నిధులను వినియోగించకుండా అధికారుల ప్రమేయం లేకుండా స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. మున్సిపాలిటీకి వచ్చిన నిధులను అన్ని వార్డులకు అందేవిధంగా చూడాలని డిమాండ్ వారు చేశారు. సమావేశంలో బండకింది అరుణ్, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, ఎర్రబోసు అశోక్, యదారం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

**బెజ్జంకి, మార్చి 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే డా॥కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గాగిల్లాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే మండల కేంద్రంలోగల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధర్మశాల నిర్మాణం, బేగంపేట, దాచారం గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరిట నిధులు పక్కదారి పట్టించి పొట్టనింపుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిని పట్టించుకోని నాయకులకు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఆలయ ఈవో విశ్వనాథ్‌శర్మ, నాయకులు శానగొండ శ్రావణ్, అక్కరవేణి పోచయ్య, ప్రవీణ్, మధుసూదన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మార్చి 15, ప్రభాతవార్త :** సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మహిళలకు వడ్డీలేని రుణాలను మంజూరు చేసినందుకు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు లింగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. మహిళల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనగాం శ్రీకాంత్, సార్ల లింగం, మల్లం బాలయ్య, కంకణాల ప్రవీణ్, ఎక్కలదేవి శ్రీనివాస్, జంగని రవి, మల్లం చందు, చింతల రమేష్, గొల్లపల్లి శ్రీనివాస్, స్వాములపల్లి రమేష్, చింతల పర్శరాములు, ఏల ప్రవీణ్, గుండా మహేష్, గోదల నవీన్, లింగంపల్లి మహేష్ పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ మహిళలకే



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంఇవో దేశిరెడ్డి

**నంగునూర్, మార్చి 15, ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ మహిళ సంఘాలకే ప్రభుత్వం అప్పగిస్తుందని మండల విద్యాధికారి దేశిరెడ్డి అన్నారు. శుక్రవారం నంగునూర్‌లోని మండల సమైఖ్య కార్యాలయంలో పాఠశాలల నిర్వహణపై మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకే నిర్వహణను మహిళలకు అప్పగిస్తుందన్నారు. ఇక నుంచి పాఠశాల కమిటీకి చైర్మన్‌గా వివో అధ్యక్షులు, పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా వీరితోపాటు ఒక క్లాసుకు ముగ్గురు మెంబర్ల చొప్పున 15 మంది సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఏపీఎం అంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళలకు అప్పగిస్తుందన్నారు. గ్రామాల్లో ఒక గ్రూపుగా ఏర్పడి స్కూల్ యూనిఫామ్స్ కుట్టి మహిళల సత్తా చాటలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వేణుగోపాల్, పిఆర్ ఏఈ శశాంక్, సీసీలు పంగ లింగం, శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు, అయా గ్రామాల వివో అధ్యక్షులు, వివోఎలు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన మండల అధ్యక్షుడు

**మర్కుక్, మార్చి 15 (ప్రభాతవార్త):** బిజెపి మర్కుక్ మండల అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన సాయిరెడ్డి రాంరెడ్డి శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేయడంతో పాటు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి బలోపేతానికి కృషి చేస్తానని రాంరెడ్డి పేర్కొన్నారు. ఆయనతో పాటు బిజెపి మండల ఇన్‌ఛార్జి, మాజీ జెడ్‌పిటిసి సింగం సత్తయ్య తదితరులు ఉన్నారు.



బిజెపి జిల్లా అధ్యక్షున్ని సన్మానిస్తున్న మండల అధ్యక్షుడు రాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి

## అమ్మ ఆదర్శ పాఠశాలలపై వివోలకు అవగాహన

**హుస్నాబాద్/అక్కన్నపేట, మార్చి 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని గురువారం ప్రభుత్వ ఆదేశాలు రావడంతో శుక్రవారం రోజున హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలలో మండల ప్రజా పరిషత్ అధికారులు వివోలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతీ పాఠశాలలో కమిటీ ఏర్పాటుకు ముగ్గురు సభ్యులను కేటాయించడం జరుగుతుందని, అందులో ఒక్కరు ఎస్సి లేదా ఎస్టిలు ఉంటారన్నారు. కమిటీ మెంబర్లకు వివోలు అధ్యక్షురాలిగా, చైర్మెన్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా ఉంటారన్నారు. కమిటీ ముఖ్యంగా విద్యార్థులకు కావాల్సిన ప్రథమిక మౌళిక సదుపాయాల బలోపేతం, బాలికలకు అదనపు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, మరమ్మతుల పనులు, పనిచేయని మరుగుదొడ్ల పునరుద్ధరణ, విద్యుదీకరణ, పారిశుద్య నిర్వహణ, సోలార్ ప్యానల్ ఏర్పాటు, పాఠశాలల నిర్వహణతో పాటువిద్యార్థులకు కావాల్సిన యూనిఫాంలు కుట్టడం లాంటివి చేస్తారని అందుకు సంబందించిన విషయాలపై వివోలతో పాటు మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సూచించారు. ఈ కార్యక్రమాలలో హుస్నాబాద్, అక్కన్నపేట ఎంపిడివోలు వేణుగోపాల్‌రెడ్డి, బానోతు జయరాంనాయక్‌తో పాటు ఎపిఎమ్‌లు, ఏఈవిఆర్‌లు, ఎంపివోలు, సిసిలతో పాటు విద్యాశాఖ నుండి సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల అంటే మంత్రికి ఎందుకు చులకన ?

### ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్‌వర్ధన్



అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోఖో నిర్వహిస్తున్న ఎబివిపి నాయకులు

**హుస్నాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** హుస్నాబాద్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండానే రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రిన్సిపాల్‌ను కళాశాల నూతన భవనంలోకి తరలించాలనడం హాస్యస్పదంగా ఉందని ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటి మెంబర్ వివేక్‌వర్ధన్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు సావుల ఆదిత్యతో కలసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెంటనే పూర్తి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోఖో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వకళాశాలలను చులకనగా చూస్తున్నారన్నారు. వసతులులేని నూతన భవనంలోకి విద్యార్థులను తరలించాలని చెప్పే కలెక్టర్ మంత్రులు వసతులు లేని కలెక్టరేట్, మంత్రి క్యాంప్ కార్యాలయాలకు మీరు వెళ్లారా అని ప్రశ్నించారు. కళాశాలలను చిన్నచూపు చూడకుండా వెంటనే కనీస సౌకర్యాలు పూర్తిచేసి తర్వాత నూతన భవనంలోకి తరలించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచిన 100 రోజులు గడిచినా కనీసం విద్యాశాఖ మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒకటైన యువ వికాసం అనే పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాకేష్, రాజేష్, చరన్, రాహుల్, అంజిరెడ్డి, శ్వేత, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఐ, సర్వేయర్‌లపై చర్యలు తీసుకోవాలి

### ఖమ్మంపల్లి గ్రామస్థుల డిమాండ్

**కొండపాక, మార్చి 15, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూమిని కొలతలు వేయడానికి వస్తామని చెప్పి సమయనికి రాకుండా తప్పించుకున్న అర్ఐ, సర్వేయర్‌ల పై చర్యలు తీసుకోవాలని ఖమ్మంపల్లి ఎంపిటీసీ యాదగిరి, గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంపల్లిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 1061లో గత కొంత కాలంగా వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో ఎంపిటీసి గ్రామస్తులతో కలిసి హైదరాబాద్‌లో ప్రజా దర్బార్‌లో, కలెక్టర్, అర్డీఒ, తహసీల్దార్ కార్యాలయాల్లో పలు మార్లు ఫిర్యాదులు చేయగా స్పందించిన అధికారులు అర్ఐ, సర్వేయర్‌లను శుక్రవారం గ్రామానికి వెళ్ళి వివాదంలో ఉన్న భూమిని సర్వే చేయాలని అదేశించిన భూమిని కొలతలు వేయడానికి రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అర్ఐ, సర్వేయర్‌ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించకుంటే తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి నూతనంగా వచ్చిన తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ భూమిని కొలతలు వేసి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు.

## దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సస్పెన్షన్

### ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**హత్నూర మార్చి 15, ప్రభాతవార్త:** హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శంకర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని సంబందిత అధికారులు తెలిపారు. శంకర్‌నాయక్ విధులలో నిర్లక్ష్యం వహిస్తున్నాడంటూ స్థానికులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సంబందిత శాఖ అధికారులు దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యునిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపారు. అనంతరం నివేదిక జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన, అనంతరం జిల్లా కలెక్టర్ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారని అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న ఏంఈవో నర్సమ్మ

## అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు

**రాయపోల్, మార్చి 15 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో బాలయ్య ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై వివో, వివోఏలకు అవగహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారిని లక్ష్మి నర్సమ్మ హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పిన, విద్యార్థుల సంఖ్యను పెంచుట, టాయిలెట్ల ఏర్పాటు తదితర అంశాలపై మౌళిక వసతుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి వారికి అవగహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనారాయణ, ఏఈపిఆర్ రామ్ కుమార్, ఏపిఎం దుర్గాప్రసాద్, సీసీ లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



సింగాయపల్లిలో ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

**వర్గల్, మార్చి 15 (ప్రభాతవార్త):** మండలంలోని సింగాయపల్లి గ్రామంలో గ్రామ దేవతలు అయిన బొడ్రాయి గండిమైసమ్మ, మాతమ్మ అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలి

### టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

**కొల్చారం, మార్చి15 ప్రభాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సమీక్షించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, పర్యవేక్షణ, నిధుల వినియోగం వంటి పనుల కోసం గతంలో ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీ స్థానంలో విద్యాశాఖ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను (ఎఎపీసీ) రాత్రికి రాత్రే ఏర్పాటు చేసిందన్నారు. గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షురాలు చైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, స్వయం సహాయక సంఘ సభ్యులైన విద్యార్థుల తల్లులను సభ్యులుగా నియామకం చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేశారన్నారు. బడికి ఎంత మాత్రం సంబంధం లేని వారిని ఎఎపీసీ చైర్మన్‌లుగా నియమించారని, గ్రామైక మహిళా సంఘం అధ్యక్షురాలిని పాఠశాల చైర్మన్‌గా నియమించడం అసంబద్ధ నిర్ణయమని అన్నారు. గ్రామీణ, ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో కొన్నిచోట్ల గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఒక్కరే ఒకటికి మించి గరిష్టంగా నాలుగు వేరువేరు ప్రాంతాల్లోని పాఠశాలలకు చైర్మన్‌గా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని నిబంధనలు సవరించి ప్రతి పాఠశాల చైర్మన్ ఆ పాఠశాల విద్యార్థి తల్లిగా ఉండేలా చూడాలని, ఆ ఆవాస ప్రాంతంలో నివాసం ఉండే వారినే నియమించాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యంను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 317 జీవో పైన ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం పట్ల వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికత ఆధారంగానే ఉద్యోగుల కేటాయింపు జరగాలని వారు డిమాండ్ చేశారు.

## కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**నర్సాపూర్, మార్చి 15, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మెదక్ జిల్లాలో ఉన్న నర్సాపూర్ నియోజకవర్గంలోని బివిఆర్ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌లను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘంసూచనలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ని కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం నర్సాపూర్ నియోజకవర్గంలో నున్న బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 5 సెగ్మెంట్‌ల కౌంటింగ్ సెంటర్, ఒక పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్ సెంటర్ ను, ట్రైబల్ వేల్ఫేర్ జూనియర్ కళాశాలలో 2 సెగ్మెంట్‌లకు కౌంటింగ్ సెంటర్‌లను ఏర్పాటు దిశగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ కమలాద్రి, బివిఆర్‌ఐటి కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, ట్రైబల్ వేల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.



కౌంటింగ్ స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, మార్చి 15 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించడంతో పాటు పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, నాయకులు నాగరాజు, గణేష్, చంద్రశేఖర్, మామిడి సురేష్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశంగౌడ్, సాజిద్, సాయి మహేష్, వార్డు సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికే అమ్మ ఆదర్శ కమిటీలు

### -ఎంపిడిఓ పివిఎస్‌ఆర్‌కె శర్మ



మాట్లాడుతున్న ఎంపిడిఓ పివిఎస్‌ఆర్‌కె. శర్మ

**ములుగు, మార్చి 15 (ప్రభాతవార్త):** గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంకోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ములుగు ఎంపిడిఓ పివిఎస్‌ఆర్‌కె.శర్మ, ఎంఈఓ ఉదయభాస్కర్‌లు తెలిపారు. శుక్రవారం ఎంపిపి సమావేశ మందిరంలో ఏపిఎం యాదగిరి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల రూపకల్పనలో మహిళలను భాగస్వామ్యం చేస్తుందన్నారు. డ్వాక్రా మహిళలతో ఏర్పాటుచేస్తున్న అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక సదుపాయాలు, బడీడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాలపై బాధ్యతలు ఉంటాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఓ నరసింహారావు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ తోట మహేష్

**హుస్నాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** విద్యార్థులు చట్టాలతో పాటు సైబర్ క్రైం గురించి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ తోట మహేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు, బాలికలకు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలతో పాటు సైబర్ క్రైం గురించి షీ టీమ్ బృందంతో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు, ఈవి టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ సెక్యూరిటీ, డయల్ 100 ప్రాముఖ్యత మైనర్ డ్రైవింగ్, సమాజ రుగ్మతలు, నేరాలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, ఆన్‌లైన్ మోసాలు, జరిగే నేరాలు అందులో పడకుండా తీసుకోవాల్సిన బాధ్యతలు, భరోసా సెంటర్లు, ఫోక్సో చట్టం, షీటీమ్ దాని ప్రాముఖ్యత, మానవ అక్రమ రవాణా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌లాంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. బాలికలు, మహిళలను రోడ్లపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వరంగా వెంటపడ్డా వెంటనే 100కు లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434, మహిళా పోలీస్‌స్టేషన్‌నంబర్ 8712667435 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, షీటీమ్ డివిజన్ బృందం సైదయ్య, స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 10 విద్యార్థులకు ఉచిత అల్పాహారం అభినందనీయం

**హుస్నాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతీ రోజు సాయంత్రం ఉచితంగా అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చి 32 రోజులుగా అందించిన హుస్నాబాద్ వాసవి క్లబ్ సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాసుదేవరెడ్డి శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సాయంత్రం ఆకలితో పిల్లల ఏకగ్రత కోల్పోకుండా ఉండేందుకు ముందుకు వచ్చి అల్పాహారం అందిచి సహకరించడం గొప్ప విషయమన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షులు నూక సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు సాయంత్రం ఆకలితో ఉంటే చదువుపై ఆసక్తి ఉండదని కాస్త అల్పాహారం అందిస్తే మరికొంత సమయం ఎక్కువ చదువుకుని ఉత్తమ మార్కులు సాధిస్తారనే ఉద్దేశంతోనే వారికి అల్పాహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మెన్ స్మిత మాట్లాడుతూ పిల్లలకు సేవ చేయడం అంటే దేవుడికి సేవచేయడంతో సమానమని, అలాంటి అవకాశం తమకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ సభ్యులు సంధ్యారాణి, వాసవి క్లబ్ కార్యదర్శి శ్యాం సుందర్, కోశాధికారి శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రవిందర్, పాఠశాల అధ్యాపకులు వీరారెడ్డి, రమణారెడ్డి, సువర్ణలీల, రజమల్లు, రమాదేవి, రాజేందర్, మార్కండేయ, శ్రీనివాస్, సుభాష్, శ్రీధర్, శకుంతల, విమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల మంజూరు పట్ల బిజెపి నాయకుల హర్షం

**హుస్నాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి సెంట్రల్ రోడ్ రిలీఫ్ నుండి శుక్రవారం రూ. 50 కోట్లు మంజూరు చేయడం పట్ల బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు, 11వ వార్డు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోడీ, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బండి సంజయ్‌కుమార్ ఈ ప్రాంత పార్లమెంట్ సభ్యులుగా ఉండి హుస్నాబాద్ నుండి రామవరంతో పాటు అక్కన్నపేట మండలంలోని అంతకపేట నుండి కొత్తకొండ వరకు 25,25 కోట్ల చొప్పున మొత్తం 50 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించిన ఎంపి సంజయ్‌కుమార్‌కు పార్టీ శ్రేణులు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, అక్కన్నపేట మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, నాయకులు స్వరూప, వేణుగోపాల్‌రావు, సంపత్‌నాయక్, కర్ణకంటి నరేష్,, గొల్లపల్లి వీరాచారి, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మోడీ, బండి సంజయ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీకేతకి ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## శ్రీకేతకి సంగమేశుడి హుండీ లెక్కింపు

**ఝరాసంగం, మార్చి 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి హుండీని శుక్రవారం పోలీసులు, సిసి కెమెరాల నిఘా నీడలో లెక్కించారు. మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుని ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా స్వామి వారికి చెల్లించుకున్న నగదు, బంగారం, వెండిలు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ శశిధర్, అర్చకులు సమక్షంలో సిసి కెమెరాలు, పోలీల నిఘా నీడలో హుండీని కామారెడ్డికి చెందిన శ్రీరాజరాజేశ్వర సేవా సంస్థ బాధ్యులు హుండీని లెక్కించగా రూ. 14,56,956 భక్తులు సమర్పించుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు బసయ్యస్వామి, శివప్రసాద్‌స్వామి, జూనియర్ అసిస్టెంట్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాచన్నస్వామి జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి



రాచన్నస్వామి జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

**జహీరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** కోహీర్ మండలంలోని బడంపేటలో కొలువున్న శ్రీరాచన్నస్వామి ఆలయ జాతర ఉత్సవాల్లో శుక్రవారం మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ జహీరాబాద్ ఇంచార్జి చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. ఆర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి రామ లింగారెడ్డి, నర్సింహారెడ్డి, కండెం నర్సింలు, ఈఓ శివరుద్రయ్యస్వామి పాల్గొన్నారు.

## శివసాయి విద్యాలయంలో స్వయం పాలన



శివసాయి విద్యాలయంలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**మనూర్, మార్చి 15, ప్రభాతవార్త:** శివసాయి విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా విద్యాధికారిగా ఎం స్వాతి, మండల విద్యాధికారిగా సిహెచ్ నందిని, ప్రధానోపాధ్యాయులుగా ఏ స్రవంతిలు విధులు నిర్వహించారు. తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా ఒక రోజు విధులు నిర్వహించిన విద్యార్థులు పాఠాలో బోధించారు. ప్రతిభ చాటిన ఉపాధ్యాయులైన విద్యార్థులను పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

## చెక్ పోస్టు స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఓ



చెక్ పోస్టు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ

**నాగల్‌గిద్ద, మార్చి 15, ప్రభాతవార్త:** మండలంలోని మోర్గి గ్రామశివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును ఆర్‌డిఓ అశోక చక్రవర్తి డిఎస్‌పి వెంకట్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. రానున్న లోకసభ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు చెక్‌పోస్టును ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌డిఓ, డిఎస్‌పిలు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ షబానా, డిప్యూటీ తహసీల్దార్ శివరామ కృష్ణ తదితరులు ఉన్నారు.

## డివిజన్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం



సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, మార్చి 15, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్, శ్రీ సాయి నగర్ కాలనీలలో 61.50 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణానికి కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శుక్రవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయా కార్యక్రమాల్లో కాలనీ అధ్యక్షులు రాజగౌడ్, శంకర్ యాదవ్, విఠల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకట్‌రామ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, చక్రవర్తి, రమేష్, వీరిశెట్టి, గోవర్ధన్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల ఆలయ ధర్మకర్తల కమిటీకి నోటిఫికేషన్

**శివ్వంపేట, మార్చి 15 ప్రభాతవార్త:**

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రసిద్ధ పవిత్ర పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కుల గ్రామ పంచాయితీ పరిధిలో గల చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల కమిటీ ఏర్పాటు కానుంది. ధర్మకర్తల కమిటీకి నోటిఫికేషన్ జారీ అయినట్లు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి సార శ్రీనివాస్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈవో సార శ్రీనివాస్ కోరారు.

# ధరణి వల్ల రైతులకు తీవ్ర అన్యాయం

### కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి

**కొల్చారం, మార్చి 15 ప్రభాతవార్త:**

గత ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో ధరణిని తెచ్చి నిజమైన భూహక్కుదారులకు తీవ్ర అన్యాయం జరిగిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ధరణి సమస్యలు తెలుసుకోవడానికి కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేశంగౌడ్ వచ్చారు. తహసీల్దార్ గఫార్ మియాతో మాట్లాడి ధరణి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లేశంగౌడ్, అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2 లక్షల 50 వేల పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. అలాగే కొల్చారం తహశీల్దార్ కార్యాలయంలో 245 పెండింగ్ దరఖాస్తులు ఉండగా 21 తహశీల్దార్‌పరిధిలో, మిగితా దరఖాస్తులు కలెక్టర్, ఆర్డీవో, సీసీఎల్ పరిధిలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు ప్రభుత్వం అని, నిజమైన రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాడుతామని అన్నారు. ఈ



ధరణి పెండింగ్ ధరఖాస్తుల వివరాలను తహశీల్దార్‌ను అడిగి తెలుసుకుంటున్న అన్వేష్‌రెడ్డి

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవన్నగారి శేఖర్, మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్, నాయకులు పట్లూరు అనిల్‌కుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అచ్చన్నపల్లి శ్రీరాములు, బీసీ సెల్ మండల అధ్యక్షులు బండి మల్లేశం, మైనారిటీసెల్ మండల అధ్యక్షులు సయ్యద్ అక్రం, మాజీ సర్పంచులు రామిరెడ్డి, శ్రీకాంత్, నాయకులు దొంకెన స్వామి, నర్సాగౌడ్, తిరుణగారి మురళీధర్‌శర్మ, మాజీ సర్పంచి ఆశన్నగారి శ్రీశైలం, గ్రామ అధ్యక్షులు పెద్ద శ్రీశైలం, వెంకట్‌గౌడ్, కిష్టాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్లు ముత్తయ్య, డాబాగౌడ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి, నాయకులు శంకర్, సాయిలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ విస్తరణ

**రామాయంపేట, మార్చి 15, ప్రభాతవార్త :** బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా కార్యవర్గ విస్తరణ కార్యక్రమం చేపట్టారు. బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు మెట్టు గంగారాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోశాధికారిగా సుంకోజు దామోదర్ చారి, క్రమశిక్షణ విభాగ్ జిల్లా అధ్యక్షులుగా పోచమ్మల గణేష్, రామాయంపేట పట్టణ ఉపాధ్యక్షులుగా పచ్చంటి రాము, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వెలుముల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల శేఖర్, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు రెడ్డమైన నరేష్, ప్రగతి ధర్మారం అధ్యక్షులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## బడంపేట జాతరలో పాల్గొన్న నరోత్తం



బడంపేట జాతరలో పాల్గొన్న మాజీ టిఎస్ఎస్‌సిడిసి చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలో కొలువున్న శ్రీరాచన్నస్వామి ఆలయ జాతర ఉత్సవాల్లో శుక్రవారం టిఎస్ఎస్‌సిడిసి మాజీ చైర్మన్ వై.నరోత్తం పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న నరోత్తంను అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకాగా వేద బ్రాహ్మణులు మంత్రాలు వల్లిస్తుండగా నరోత్తం ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకలు ఆశీర్వచనాలు చేసి తీర్ధ ప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్ ప్రభు గౌడ్, వై తరుణ్, బిజి సందీప్, చెంగల్ జైపాల్, సుధాకర్ శివరాజ్‌స్వామి, శివమూర్తి స్వామి, ఆలయ ఇఓ శివరుద్రప్ప స్వామి, బుజంగం తదితరులు పాల్గొన్నారు.

## సిఎం అల్పాహారం పథకాన్ని తిరిగి కొనసాగించాలి

**మిరుదొడ్డి, మార్చి 15, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం ఎన్నికల ముందు అమలులోకి తెచ్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిఎం అల్పాహారం పథకాన్ని తిరిగి కొనసాగించాలని తెలంగాణ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ విన్నవించారు. శుక్రవారం సిఎం ప్రజావాణిలో భాగంగా చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద పిల్లల అకలి తీర్చే రాగి జావను ప్రార్థన తర్వాత వెంటనే అందించాలన్నారు. సిఎం అల్పాహారం పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టి పేద పిల్లల అకలి తీర్చాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, వేతనాలను సకాలంలో చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలకు గురైన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. బాధితులు కోర్టు వాయిదాలకు హాజరయ్యే సమయంలో రవాణా చార్జీలు, మధ్యాహ్న భోజనం చట్ట ప్రకారం అందించాలన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## భువనగిరి ఎంపి టికెట్ కొమ్మూరికి ఇవ్వాలి

**చేర్యాల (మద్దూరు), మార్చి 15, ప్రభాతవార్త :** భువనగిరి పార్లమెంట్ ఎంపి టికెట్ కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికే ఇవ్వాలని ఆ పార్టీ నేతలు అధిష్టానాన్ని కోరుతున్నట్లు యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమలాకర్ పాల్గొని మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ ఎంపి సెగ్మెంట్ ఏర్పాటు అయినప్పటి నుండి జనగామ నియోజకవర్గానికి ఒకసారి కూడా టికెట్ ఇవ్వలేదని ఈసారైన కొమ్మూరికి టికెట్ ఇవ్వాలని వారు కోరారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**శివ్వంపేట, మార్చి15 ప్రభాతవార్త:** పేద కుటుంబానికి చెందిన వ్యక్తి అకాల మరణం చెందడంతో జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త స్పందించి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఉదార స్వభావమిది. శివ్వంపేట మండలం లింగోజిగూడ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సత్తయ్య, అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మహేష్ గుప్త మృతుని అంత్యక్రియలకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చింత స్వామి ద్వారా ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 15, ప్రభాతవార్త :** బాలింతలు, గర్భవతులు, మహిళలు, చిన్నారులు అరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని సరైన మోతాదులో తీసుకోవాలని ఇంచార్జి సీడీపీఓ రమాదేవి తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాలలో శుక్రవారం పోషణ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా అమె మాట్లాడుతూ మార్కెట్లో లభించే రసాయన పదార్థాలతో కైడిన అహార పదార్ధాలను వినియోగించొద్దని ప్రకృతి సిద్దంగా లభించే కూరగాయలు, పండ్లు, అకుకూరలు తినడం వలన పోషక విలువలు ఎక్కువగా లభిస్తాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామస్థాయిలో మహిళా సంఘాలకు పోషక అహార పదార్థాలపై అవగాహన కలిగి ఉండేలా కార్యక్రమాలను చేపట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహాలక్ష్మీ, స్వరూప, అంగన్‌వాడీ టీచర్స్ పద్మ, లావణ్య, సరోజన, విజయ, స్వప్న, లతా తదితరులు పాల్గొన్నారు.

## మాక్‌పోల్ నిర్వహించిన విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, మార్చి 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాంచార్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం మాక్‌పోల్ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని ఓటు హక్కును ఎలా వినియోగించుకుంటున్నారు అనే విషయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులే స్వయంగా ఓటు హక్కును వినియోగించుకొని పాఠశాల లీడర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని మండల నోడల్ అధికారి వెంకటేశం పర్యవేక్షించారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పాఠశాల లీడర్‌గా నలుగురు పోటీ చేయగా ప్రవీణ్ తన సమీప ప్రత్యర్థి రక్షితపై 13 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మాక్ పోల్ నిర్వహణను బేషుగ్గా నిర్వహించిన విద్యార్థులను హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు రవి, మల్లికార్జున్‌రెడ్డి, దేవరాజు, స్రవంతి, సుజాతలు అభినందించారు.

## క్రీడా వస్తువుల అందజేత

**మిరుదొడ్డి, మార్చి 15, ప్రభాతవార్త :**

భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠ శాలకు గ్రామస్తులు లోకేష్, వార్డు మాజీ సభ్యులు నరసింహులు, లెనిన్ రాజులు రూ.10 వేల విలువ చేసే క్రీడాపరికరాలను హెచ్ఎం రాజేందర్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యాదయ్య, రాజు, పీఈటీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి : మహిపాల్‌యాదవ్

**వర్గల్, మార్చి 15 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బిజెపి వర్గల్ మండల నాయకులు మఠం మహిపాల్‌యాదవ్, ఎల్కంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు రూ.10వేల విలువైన డ్రమ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మంకి యాదగిరి, పూదరి ప్రశాంత్‌గౌడ్, కృష్ణచారి, బాగులు, శ్రీశైలంయాదవ్, రాముగౌడ్, నిఖిల్‌రెడ్డి, కుమార్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, చంద్రారెడ్డి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

### రాజిరెడ్డి, మల్లేశంగౌడ్

**కొల్చారం, మార్చి 15 ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగలగారి మల్లేశంగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం నాగులగారి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో ఆవుల రాజిరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ కొల్చారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. కొల్చారంతో పాటు అప్పాజిపల్లి, వడ్డెర కాలనీ, కిష్టాపూర్, చిన్నఘనపూర్, వరిగుంతం, రంగంపేట గ్రామాల్లో ఉపాధి హామీ నిధుల ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్బంగా పార్టీ ఉపాధ్యక్షులు గోవర్ధన్, సీనియర్ నాయకులు విఠల్‌గౌడ్ నేతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్, రాజిరెడ్డిలు మాట్లాడుతూ ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజా పాలన కాంగ్రెస్ దూసుకుపోతుం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించి కొబ్బరికాయ కొడుతున్న ఆవుల రాజిరెడ్డి

దన్నారు. ఈ కార్యక్రమంలో తిరుణగారి మురళీధర్‌శర్మపంతులు, నాయకులు దేవన్నగారి శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోవర్ధన్, ప్రధానకార్యదర్శి గంగసాని మహేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్, పట్లూరు అనిల్‌కుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అచ్చన్నపల్లి శ్రీరాములు, బీసీసెల్ మండల అధ్యక్షులు బండి మల్లేశం, మైనారిటీసెల్ మండల అధ్యక్షులు సయ్యద్ అక్రం, మాజీ సర్పంచులు రామిరెడ్డి, శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంకెన స్వామి, నర్సాగౌడ్, విజయ్‌గౌడ్, విఠల్‌గౌడ్, ఉపేందర్‌గౌడ్, గడ్డం ఏసు, గడ్డం రాములు, కుమ్మరి నాగరాజు, మాజీ సర్పంచి ఆశన్నగారి శ్రీశైలం, గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ద శ్రీశైలం, వెంకట్‌గౌడ్, కిష్టాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్లు ముత్తయ్య, డాబాగౌడ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, సాయిలు, చిన్నఘనపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని సన్మానిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

## ఎమ్మెల్యేను సన్మానించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, మార్చి 15, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని భారతీనగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజి కాలనీలో సొసైటీ కార్యలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారి డివిజన్‌కు చేరుకోవడంతో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి సొసైటీ డైరెక్టర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంజూరైన అభివృద్ధి పనులు(మజీద్ మరమ్మతులు, సంకల్ప గ్రౌండ్‌లో షెడ్ నిర్మాణం, ఎప్‌పార్క్, నేతాజా హాల్‌లో పలు పనులు) త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్ పేర్కొన్నారు. డివిజన్‌లో మిగిలిపోయిన సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని వినతి చేశామని అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాగమణి, కాలనీ అధ్యక్షులు వెంకట్‌రావు, ఉపాధ్యక్షులు నారాయణగౌడ్, కార్యదర్శి సుబ్బారావు, డైరెక్టర్లు నీలకంఠం, రాములు, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు బూన్, ఎంఐజి అధ్యక్షులు భాస్కర్‌ముదిరాజ్, కార్యదర్శి కుమార్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, వార్డు సభ్యులు తిలవత్, నాయకులు సంపత్ గౌడ్, సురేందర్, చంద్రయ్య, రాణి యాదవ్, శ్రీలత, అనిత, బీబీ, లక్ష్మీ, స్వర్ణలత, స్వరూప, శ్రీదేవి, బి లక్ష్మీ, పద్మ, సీనియర్ సిటీజన్లు పాల్గొన్నారు.

## చెల్మెడలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మునిపల్లి, మార్చి 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెల్మెడ గ్రామంలో 5 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా సూచనలమేరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమ పూజ నిర్వహించిన పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిల్లోడి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తక్కడపల్లి సంగమేశ్వర్, రుద్ర, కృష్ణ, గ్రామ అధ్యక్షులు కమ్మరి నర్సింలు, యూత్ అధ్యక్షులు రుద్ర శ్రీదర్, మైనారీన అధ్యక్షులు యండి జావిద్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఇమ్మానుయేల్గారు, నాయకులు గడ్డమీది రాములు, బొబ్బిలి సంగమేశ్వర్, గౌండ్ల దత్తు, తలారి చంద్రయ్య, గాండ్ల గారుదాస్, చిప్పె సంగమేష్, మహమ్మద్ ఖాదర్, మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, పంచాయితీ కార్యదర్శి అనిల్, ఫాస్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవం



విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, మార్చి 15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని దుర్గమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని దుర్గమ్మ తల్లి ఆలయ కమిటీ పేర్కొంది. శుక్రవారం పెద్దశంకరంపేటలోని దుర్గమ్మ తల్లి దేవాలయం వద్ద విగ్రహ పునఃప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వాన పత్రికలను గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. మాధవానంద సరస్వతిస్వామి వారి ఆశీస్సులతో ఏప్రిల్ 4వ తేదీన గణపతి పూజ, పుణ్య హవచనం, అఖండ దీపారాధన, 5వ తేదీన గణపతిపూజ, నవగ్రహా, మాతృకా ప్రధాన దేవత కలశస్థాపన, 6వ తేదీన దుర్గమ్మతల్లి, సంతాన నాగేంద్రుడు, కేశకమ్మ తల్లి, పాపమ్మ తల్లి, ధ్వజస్తంభం, అమ్మవారి పాదుకా ప్రతిష్టాపన, 7వ తేదీన సాయంత్రం అమ్మవారికి బోనాల ఊరేగింపు, 9వ తేదీన ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, సాయంత్రం బండ్ల ప్రదక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యవర్గ బాధ్యులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ బాధ్యులు, గ్రామ పెద్దలు జంగం శ్రీనివాస్, మురళిపంతులు, సుభాష్‌గౌడ్, దస్వంత్, జోడు రవీందర్, అన్నారం సత్యనారాయణ, బాయికాడి నర్సింలు చారి, నీలకంటి విఠల్, లక్ష్మణ్, చాకలి నారాయణ, మంగలి మనోహర్, సంగమేశ్వర్, భూమయ్య, బుగుడాల సాయిలు, శ్రావణ్‌కుమార్, పున్నయ్య, సీతారామారావు దేశ్‌పాండే పాల్గొన్నారు.

## బడంపేట జాతరకు ఢిల్లీ వసంత్



బడంపేట జాతరలో పాల్గొన్న బిజెపి నేత ఢిల్లీ వసంత్

**జహీరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** కోహీర్ మండలంలోని బడంపేటలో కొనసాగుతున్న శ్రీరాచన్నస్వామి జాతర ఉత్సవాల్లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ నేత, జాతీయ రైతు సేత ఢిల్లీ వసంత్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఢిల్లీ వసంత్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులో సుభిక్షంగా ఉండేలా దీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఢిల్లీ వసంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ వసంత్ బృందం సభ్యులు విశ్వనాథ్ యాదవ్, అశోక్ పాటిల్, స్టీవెన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## హత్నూర మండలంలో కాన్షీరామ్ జయంతి

**హత్నూర మార్చి 15, ప్రభాతవార్త:** హత్నూర మండలం ఎల్లమ్మగూడెంలో శుక్రవారం తెలంగాణ ప్రజాహక్కుల పరిరక్షణసమితి ఆధ్వర్యంలో కాన్షీరామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో మరో చారిత్రక మలుపు తిప్పిన నాయకుడు కాన్షీరామ్ అని కొనియడారు. కార్యాక్రమంలో నాయకులు ఎర్ర యాదగిరి, సందీప్, రామ్ చరణ్, జైరామ్, గోపిచంద్, ప్రదీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జయంతి కార్యాక్రమంలో పాల్గొన్న సంఘం నాయకులు